క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కురిచేడు: మండలంలోని ఆవులమంద, కురిచేడు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ఆదివారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. 33 కేవీ లైన్ మరమ్మతులు ఉన్నందున ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు పోలీసుల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా

యర్రగొండపాలెం: ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు స్థానిక బీఆర్ అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో వివిధ కంపెనీలు పాల్గొంటున్నాయని, సర్కిల్ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల పరిధిలోని 10వ తరగతి ఆపై చదివిన అభ్యర్థులు తమ పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు కాటమరాజు తిరునాళ్ల ఏర్పాట్లపై సమావేశం

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో వెలసిన వేనూతల కాటమరాజు స్వామి తిరునాళ్ల సందర్భంగా మహోత్సవ ఏర్పాట్లపై చింతగుంట్ల గ్రామం ఆదివారం ఉదయం 10 గంటలకు ఆంజనేయస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పల్లెబోయిన వెంకటరాజు శనివారం సాయంత్రం తెలిపారు. సమావేశానికి ఆలయం కమిటీ సభ్యులు, సేవా సమితి సభ్యులు, యాదవ పెద్దలు, అచార గ్రామ పెద్దలు, పూజారులు, యాదవులు తప్పనిసరిగా హాజరై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

కల్లూరులో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర


కల్లూరులో ర్యాలీ చేస్తున్న ఆరోగ్య, ఆశా సిబ్బంది

కురిచేడు: మండలంలోని కల్లూరు గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం సర్పంచ్ నక్కారామకృష్ణ, కార్యదర్శి బాషాలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ ప్రదర్శన నిర్వహించి ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ వాడకంపై నిషేధాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలు ప్రధాన పాత్ర పోషించాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త శివన్నారాయణ

దర్శి: రైతులకు మేలు చేయడంలో శాస్త్రవేత్తలు ప్రధాన పాత్ర పోషించాలని విస్తరణ సంచాలకులు డాక్టర్ శివన్నారాయణ అన్నారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం శనివారం శాస్త్రీయ సలహా మండలి సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ డీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ప్రదర్శన, అమ్మకం భాగంగా వివిధ రకాల పంటల విత్తనాలు, ఉత్పత్తులను ప్రదర్శించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జీ రమేష్ 2024–25లో సాధించిన ప్రగతిని సలహా మండలి సభ్యులకు వివరించారు. 2025–26లో చేపట్టబోయే కార్యాచరణ క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పీ సంధ్యారాణి, డాక్టర్ సీహెచ్ వరప్రసాద్‌రావు, డాక్టర్ టీ వెంకటేశ్వరరెడ్డి, టీ మానస, అధికారులు రైతులు పాల్గొన్నారు.

పది పరీక్షలే తొలి అడుగులు


పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

తాళ్లూరు: పదో తరగతి పరీక్షలు విద్యార్థులకు భవిష్యత్తులో మంచి విజయాన్ని అందించేందుకు దోహదపడతాయని హెచ్‌ఎం సిహెచ్ అరుణకుమారి అన్నారు. మండలంలోని తూర్పుగంగవరంలో ఉన్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సరస్వతీ పూజ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఉపాధ్యాయులు నాగిరెడ్డి ,శ్రీనివాసులు, పవన్ కుమార్ ,లక్ష్మీనారాయణ కృష్ణారెడ్డి, ఆంజనేయులు, పీఈటీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అగ్గిని.. ఆర్పేదెవరు!


ఖాళీగా దర్శనమిస్తున్న అగ్నిమాపక కేంద్రం


అగ్ని ప్రమాదంలో బకెట్ల ద్వారా నీటిని చల్లుతున్న సిబ్బంది

- అందుబాటులో లేని అగ్నిమాపక వాహనం
- రిపేరులో ఉందంటున్న అగ్నిమాపక సిబ్బంది
- ప్రమాదాలంటేనే హడలుతున్న మండల ప్రజలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం, అధికారులు

పెద్దదోర్నాల: అసలే దట్టమైన అడవి ప్రాంతం.. చుట్టూ కొండలు. ఎండలు మండుతున్నాయి. వేసవి ప్రారంభం నుంచే సూర్యుడు సెగలు కక్కుతున్నాడు. ఏమాత్రం అప్రమత్తంగా ఉన్నా భారీగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి. దీంతో మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయితే ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను ఆర్పే అగ్నిమాపక వాహనం అందుబాటులో లేక పోవటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండల కేంద్రంలో సకల సౌకర్యాలతో ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రంలో వాహనం గత కొంత కాలం నుంచి అందుబాటులో లేక పోవటం విశేషం. దీంతో నిప్పు పేరెత్తితేనే రైతులు, సామాన్య ప్రజలు హడలి పోతున్నారు. కొద్ది రోజుల నుంచి జరుగుతున్న అగ్ని ప్రమాదాలపై భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో అగ్నిమాపక వాహనం లేకపోవటంతో, ఇతర ప్రాంతాల నుంచి వాహనాన్ని రప్పించే పరిస్థితి నెలకొంది. చిన్న చిన్న ప్రమాదాలు సంభవిస్తే మాత్రం అగ్నిమాపక సిబ్బంది వెళ్లి బకెట్లు, బిందెలతో మంటలార్పే కార్యక్రమాలను చేపడుతున్నారు. చిన్న చిన్న ప్రమాదాలు జరిగిప్పుడు ఇలా మంటలను ఆర్పేందుకు బకెట్లు, బిందెలతో నీళ్ల పోసే కార్యక్రమం మంచిదే కాని, గుడిసెలు, నివాస గృహాల్లో ప్రమాదాలు సంభవిస్తే తమ పరిస్థితి ఏంటని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మరమ్మతులకు గురై.. తిరిగి రాక

మండల పరిధిలోని గంటవానిపల్లెలో మహాశివ రాత్రి సమయంలో ఓ రైతుకు చెందిన మిర్చి కల్లోనికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవటంతో 30 క్వింటాళ్ల మిర్చి అగ్నికి అహుతి అయింది. ప్రమాదానికి సంబంధించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా అక్కడ వాహనం లేదన్న సమాధానం వచ్చింది. దీంతో సమాచారమందుకున్న అందుకున్న మొబైల్ పోలీసులు మోటార్ల ద్వారా మండలను అదుపులోకి తెచ్చారు.

- మండల కేంద్రంలోని సాయిబాబా గుడి వద్ద మంటలు అందుకోవటంతో ఓ మైదానం ప్రాంతంలోని చిల్లచెట్లు తగలబడ్డాయి. దీంతో యర్రగొండపాలేనికి చెందిన అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపులోకి తెచ్చింది.
- మండల కేంద్రంలోని గిరిజన కార్పొరేషన్ వీధిలో జరిగిన ప్రమాదంలో సిబ్బంది హాజరై బకెట్లతో నీళ్ల చల్లి మంటలను ఆర్పి వేశారు. అగ్నిమాపక వాహనం విషయమై సిబ్బందిని ప్రశ్నించగా వాహనాన్ని మరమ్మతుల నిమిత్తం రేపల్లె తరలించామని సిబ్బంది చెప్తున్నారు. ఇలా తరచూ జరుగుతున్న ప్రమాదాలతో మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి త్వరిత గతిన వాహనానికి మరమ్మతులు నిర్వహించి అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

> **భయాందోళనలో ప్రజలు ఉన్నారు..**
> అగ్నిమాపక వాహనం అందుబాటులో లేకపోవటంతో మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన కార్పొరేషన్ వీధిలో చిన్నపాటి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే సిబ్బంది వచ్చి బకెట్ల ద్వారా నీటిని చిమ్మి మంటలను అర్పివేశారు. వాహనం లేనప్పుడు పెద్ద ప్రమాదం ఏర్పడితే ఇబ్బందులు తప్పవు. అధికారులు చర్యలు తీసుకుని వాహనాన్ని త్వరలోనే వాహనాన్ని తీసుకురావాలి.
> – షేక్. రబ్బానీ, పెద్దదోర్నాల,


వెంకటాచల క్షేత్రం


కురిచేడు: వీరాంజనేయస్వామి ఆలయం

నేటి నుంచి లక్ష్మీ పద్మావతి అమ్మవారి తిరునాళ్లు

దర్శి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వెంకటాచల క్షేత్రం కొండపైన వెలసిన లక్ష్మీ పద్మావతీ దేవి అమ్మవారి సమేత వెంకటేశ్వర స్వామి వారి 17వ వార్షిక తిరునాళ్ల నేటి నుంచి మూడు రోజులు పాటు జరుగుతాయని ఆలయ కమిటీ కార్యదర్శి సందిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం బ్రహ్మోత్సవాల ప్రాముఖ్యత, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, కోలాట కార్యక్రమాలు, అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపన, స్వామివారిని పెండ్లి కుమారుని చేయుట, ధ్వజారోహణ ఉంటుందన్నారు.

సోమవారం సుప్రభాత సేవ, నిత్యార్చనలు, నిత్యహోమం, బలిహరణ, రాయభార మహోత్సవం, స్వామివారి కల్యాణం నిర్వహిస్తారన్నారు. మంగళవారం సుప్రభాత సేవ, నిత్యార్చన, నిత్యహోమం, బలిహరణ, వసంతోత్సవం , పవలింపు సేవ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్యక్రమానికి భక్తులు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.


పూజలందుకుంటున్న వెంకటేశ్వరస్వామి, పద్మావతీ దేవి అమ్మవారు, లక్ష్మీదేవి అమ్మవారు

కురిచేడులో...

కురిచేడు: మండలంలోని బోదనంపాడు గ్రామంలో వేంచేసి ఉన్న వీరాంజనేయస్వామి తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త లక్కాకుల చిన్న వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. సోమవారం ఉదయం 5 గంటలకు స్వామివారికి పంచామృత అభిషేకం, 6 గంటలకు అలంకరణ,7 గంటలకు ఆకుపూజ, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు భజనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఆలయ విగ్రహ ప్రతిష్ట ముచికుంద మహర్షి చేతుల మీదుగా జరిగినట్లు శాసనాల ద్వారా తెలుస్తుంది.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కురిచేడు: పదో రతగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో ఆర్ వస్త్రాంనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు 15 పాఠశాలల నుంచి 576 మంది విద్యార్థులు పరీక్షలు మూడు కేంద్రాల్లో రాయనున్నారు. వారిలో 258 మంది బాలురు, 318 మంది బాలికలు పరీక్షలు రాస్తున్నారు. వారికోసం 26 ఇన్విజిలేటర్లను నియమించారు.

ప్రైవేటు పాఠశాలల దందా..

అయితే కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల కనుసన్నల్లో ఇన్విజిలేటర్ల నియామకం జరిగినట్లు ప్రచారం కొనసాగుతోంది. పరీక్షల కేంద్రాలలో కూడా ప్రైవేటు యాజమాన్యాలు కొందరు మాస్ కాపీయింగ్‌కు తెరలేపినట్లు పేరుచెప్పటానికి ఇష్టపడని కొందరు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టరు, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పరీక్షలు పకడ్బందీగా, మాస్ కాపీయింగ్ జరగకుండా నిర్వహించాలని వారు కోరుతున్నారు.

యర్రగొండపాలెంలో..

యర్రగొండపాలెం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో పి.ఆంజనేయులు శనివారం తెలిపారు. సోమవారం నుంచి జరిగే ఈ పరీక్షల్లో 910 మంది విద్యార్థులు పట్టణంలోని 8 సెంటర్లలో పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. వారితో పాటు ఆ సెంటర్లలోనే ఓపెన్ టెన్త్‌కు చెందిన 330 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 164 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 150 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 72, గురుకుల పాఠశాలలో 96, చైతన్య స్కూల్‌లో 96, కృష్ణవేణి స్కూల్‌లో 98 మంది, రెయిన్‌బో స్కూల్‌లో 72, నలంద స్కూల్‌లో 162 మంది ప్రకారం రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఆయన తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు తల్లిదండ్రులు సహకరించాలని ఆయన కోరారు.

పరీక్ష మెటీరియల్ పంపిణీ


పరీక్ష మెటీరియల్ పంపిణీ చేస్తున్న దాత

దర్శి: పదో తరగతి విద్యార్థులకు దాత పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. మండలంలోని పాతకమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ముచ్చుమారి వెంకటరెడ్డి రూ.6500 విలువ గల పాడ్‌లు, పెన్‌లు ఇతర పరీక్ష మెటీరియల్‌ను విద్యార్థులకు శనివారం అందజేశారు. అనంతరం దాతను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వైఎస్ఆర్‌కే ప్రసాద్, సత్యనారాయణ, సింగంశెట్టి మారుతీ కొండలరావు,యు సురేష్‌బాబు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణం నాశనం


అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ ఆదినారాయణ, అధికారులు

పెద్దారవీడు: ప్లాస్టిక్‌తో పర్యావరణం నాశనం అవుతుందని అధికారులు పేర్కొన్నారు. మండలంలో గొబ్బూరు గ్రామంలో సర్పంచ్ అంగిరేకుల ఆదినారాయణ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధితపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులను వాడకుండా జనపనార, గుడ్డ సంచులను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వాడుకోవాలని తెలిపారు. ప్లాస్టిక్ సంచుల తయారీలో ఉపయోగించే రసాయనాలు మురుగునీటి ప్రవాహాన్ని నిరోధించి భూగర్భ జలాలను కలుషతం చేయడానికి దారి తీస్తుందన్నారు. ప్లాస్టిక్ వస్తువుల కన్నా ప్లాస్టిక్ సంచుల వాడకమే చాలా ప్రమాదకరమని, పలుచగా ఉండే ప్లాస్టిక్ సంచులను అతిగా వాడి ఎక్కడపడితే అక్కడ పడేయడం, వీటిని రీసైకిల్ చేసే అవకాశం లేకపోవడం వల్ల భవిష్యత్తులో పెనుప్రమాదమే ఎదురవుతుందని పర్యావరణ హితులు భయపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ జ్ఞానసుందర్‌రాజు, పంచాయతీ కార్యదర్శి టీవి సుధాకరరెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ అమ్మవారి నగరోత్సవం

దర్శి: పట్టణంలోని బంగారమ్మ బావి వద్ద వెలసిన నిదానం పాటి శ్రీలక్ష్మీ అమ్మవారి నగరోత్సం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయం నిర్వాహకులు కట్టికోట హరీష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పూజాకార్యక్రమాలకు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. మహిళలు కోలాట ప్రదర్శనలు నిర్వహిస్తూ ఘనంగా అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.

నేడు తిరునాళ్ల నిర్వహణ..

పూజా కార్యక్రమాల్లో భాగంగా నేడు అమ్మవారి తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు హరీష్, నక్కా రంగా, ఇస్తలమూడి చెన్నారెడ్డి, యాతం రమణారెడ్డిలు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులందరూ హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు.

మోటారు సైకిల్ దగ్ధం


కాలిపోయిన బైక్

దర్శి (ముండ్లమూరు): పొలంలో కంప తగుల బెడుతుండగా ప్రమాదవశాస్తు ఆ మంటలు మోటారు సైకిల్‌పై పడి మోటారు సైకిల్ పూర్తిగా దగ్ధమైంది. ఈఘటన మండలంలోని పసుపుగల్లు శివారు పొలాల్లో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు ఎడమకంటి నాగార్జున రెడ్డి తన పొలంలో చిల్లచెట్లు తొలగించి కంపను తగుల బెట్టాడు. గాలికి మంటలు పెద్దగా లేచి వెళ్లి తనకు చెందిన బైక్‌పై పడ్డాయి. దీంతో మోటారు సైకిల్‌లోని పెట్రోల్‌కు మంటలు అంటుకుని పెద్ద శబ్దం వచ్చింది. చిల్లకంపను తొలగిస్తున్న నాగార్జునరెడ్డి అది చూసి మంటలార్పాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. మోటారు సైకిల్ పూర్తిగా దగ్ధమైంది.

వ్యవసాయ యాంత్రీకరణకు నిధుల కేటాయింపు

దొనకొండ: వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి కేటాయించినట్లు నిధులు కేటాయించినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి మండలానికి రూ.6 లక్షలు ప్రభుత్వం కేటాయించిందన్నారు. రైతులకు అవసరమైన 4 రకాలకు చెందిన 38 యంత్ర పరికరాలను 50 శాతం సబ్సిడీపై అందజేస్తామన్నారు. సోమవారం నుంచి రైతులు రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందులో ఎస్సీ రైతులకు 6, ఎస్టీ రైతులకు 2 పరికరాలు కేటాయించారు. ఈ పథకంలో బ్యాటరీ స్ప్రేయర్లు 8, తైవాన్ పంపులు 13, రోటావేటర్ 1, ట్రాక్టర్ గొర్రు, నాగలి, గుంటక, విత్తన గొర్రు 16 ఉన్నాయని తెలిపారు. ఈ పథకం కింద లబ్ధి పొందుటకు చిన్న, సన్నకారు రైతులు మాత్రమే అర్హులని, గత మూడు సంవత్సరాల్లో ఏదో ఒక సీజన్‌లో పంట నమోదు చేసుకోవాలన్నారు. గత 5 సంవత్సరాల్లో ప్రభుత్వ పథకాల్లో సబ్సిడీపై పనిముట్లు తీసుకోని వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఇస్తారన్నారు. రైతులకు వెబ్‌ల్యాండ్‌లో నమోదై ఉండాలన్నారు.

కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నకలు, ఎస్సీ, ఎస్టీ రైతులు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకుని సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసే సమయంలో ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబర్ ఓటీపీ కోసం తీసుకెళ్లాలన్నారు. అవకాశాన్ని మండలంలోని ఎస్సీ, ఎస్టీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ తెలిపారు.

జాతీయ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేయాలి


డ్రైవింగ్ స్కూల్ శిలాఫలకం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

దర్శి: పాలకులు నిర్లక్ష్యం వీడి నిర్మాణంలో ఉన్న జాతీయ డ్రైవింగ్ స్కూల్‌ను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తాండవ రంగారావు అన్నారు. మండలంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా సాయి నగర్‌లోని డ్రైవింగ్ స్కూల్‌ను సీపీఎం బృందం సందర్శించారు. ఈసందర్భంగా రంగారావు మాట్లాడుతూ ఐడీటీఆర్ పథకంలో భాగంగా మారుతీ సుజికీ కంపెనీతో కలసి ఈ నిర్మాణాన్ని ప్రారంభించారన్నారు. సంవత్సరానికి 20 వేల మందికి డ్రైవింగ్ శిక్షణే లక్ష్యంగా రూ.18.50 కోట్ల అంచనాతో 2016లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాన్ని ప్రారంభించిందన్నారు. డ్రైవింగ్ స్కూల్ నిర్మాణం పూర్తి అయితే దర్శి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. చదువుకున్న యువతీ యువకులకు ఉద్యోగాలు వస్తాయని కార్మికులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని నిరుద్యోగ సమస్య తీరుతుందని ఆనందపడ్డారన్నారు. ఇప్పటి తొమ్మిదేళ్ల అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెతగా ఉందన్నారు.

ఎనిమిది నెలలైనా అతిగతిలేదు..

2024లో టీడీపీ అధికారంలోకి రాగానే టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న గొట్టిపాటి లక్ష్మీ రవాణా శాఖమంత్రి నికలసి రూ.19 కోట్లు మంజూరు చేస్తున్నామని మొదటి సంతకం నిధులు కేటాయించడమే అని చెప్పారన్నారు. వెంటనే డ్రైవింగ్ స్కూల్ పనులు ప్రారంభించి నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించి ఇప్పటికి ఎనిమిది నెలలు అయినా అతీ గతీ లేదని విమర్శించారు. మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ డ్రైవింగ్ స్కూల్‌పూర్తి అయితే ఐదు జిల్లాలైన ప్రకాశం, నెల్లూరు, కడప, కర్నూలు, గుంటూరు ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల మందికి ఉపాధి కలుగుతుందని ప్రభుత్వం అంచనా వేసిందని చెప్పారు. డ్రైవింగ్ స్కూల్ నిర్మాణాలు పూర్తి అయ్యేవరకు సీపీఎం పోరాటాలు కొనసాగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి పోట్లూరి పుల్లయ్య, నారాయణమ్మ, కేవీపిచ్చయ్య, ఈమని నాగేశ్వరరావు, మెలికాఏసుబాబు, కోమరగిరి కోటేశ్వరరావు, సుబ్బరత్నమ్మ, బుల్లబ్బాయి, రమేష్‌బాబులు పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు శనివారం చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో అలంకరించారు. అమ్మవారి ఎదుట ఉన్న శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు.







కొండ కోనల్లో.. మంచు వెన్నెల్లో

పెద్దదోర్నాల: వేసవి రాకముందే ఎండలు దంచికొడుతున్నాయి కాని నల్లమల అటవీ ప్రాంతంలో మాత్రం మంచు వర్షం కురుస్తోంది. మండల పరిదిలోని పలు ప్రాంతాలలో మంచు దుప్పటి పరుచుకుని వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. దీంతో ఉదయం తొమ్మిది గంటల వరకు వాతావరం పొగ మంచుతో కాశ్మీరాన్ని తలపించింది. దీంతో పాటు సన్నగా హిమవర్షం కురుస్తుండటంతో పట్టణ ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరారు. శ్రీశైలం వెళ్లే పర్యాటకులు, యాత్రికులు మంచు వాతావరణంలో మైమరిచిపోయారు.